సాక్షి
బాపట్ల
ఆదివారం । 8 । జూన్ । 2025



ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: వేమవరంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ 21వ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 511.60 అడుగుల వద్ద ఉంది. ఇది 134.4032 టీఎంసీలకు సమానం.

నేడు కృష్ణవేణి విగ్రహ ప్రతిష్ట



రెంటచింతల: సత్రశాల వద్ద శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానం ఆవరణలో ఆదివారం కృష్ణవేణి అమ్మవారి విగ్రహం ప్రతిష్టించనున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి, అన్నదాన కమిటీ సభ్యులు తెలిపారు.

న్యూస్‌రీల్

నిత్యాన్నదానం, బంగారు తాపడం పనులకు విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి, బంగారు తాపడం పనులకు విజయవాడకు చెందిన భక్తులు శనివారం రూ. 2.52 లక్షల విరాళాన్ని అందజేశారు. నగరంలోని రామచంద్రనగర్‌కు చెందిన బట్టు నాగేశ్వరరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. నాగేశ్వరరావు పేరిట రూ. 1,51,116 విరాళాన్ని, జిష్ణురావు పేరిట బంగారు తాపడం పనులకు రూ. 1,01,116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

నేడు ఏపీసీబీఈఏ రాష్ట్ర మహాసభలు

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏపీసీబీఈఏ) పదో రాష్ట్ర మహాసభలు మచిలీపట్నంలో ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.గోపీనాథ్ శనివారం తెలిపారు. జిల్లా కోర్టు సెంటర్‌లోని రెవెన్యూ కల్యాణ మండపంలో మహాసభలు జరుగుతాయని పేర్కొన్నారు. మహాసభలకు 13 జిల్లాల డీసీసీబీ ఉద్యోగులు హాజరుకానున్నారని తెలిపారు. సమావేశానికి జిల్లాలోని సహకార బ్యాంకుల ఉద్యోగులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

వైభవంగా శోభాయాత్ర



విజయవాడ కల్చరల్: వేంకటేశ్వరుడి శోభాయాత్ర వైభవంగా జరిగింది. పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండప ప్రాంగణంలోని పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం దేవాలయంలో నిర్వహించిన వైదిక కార్యక్రమాలు భక్తిగా సాగాయి. ఉదయం వేంకటేశ్వర స్వామికి దేవాలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వివిధ రకాల పూలతో అలంకరించిన పల్లకీపై పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామిని దేవాలయ ప్రాంగణంలో ఊరేగించారు. దేవాలయన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆటోవాలలకు మిత్ర ద్రోహం

- వాహనమిత్ర ఊసే ఎత్తని కూటమి సర్కార్
- నాడు వాహనమిత్రతో ఆటో డ్రైవర్లకు భరోసా
- వరుసగా ఐదేళ్లు పథకాన్ని అమలుచేసిన జగన్ సర్కార్
- జిల్లాలోని లబ్ధిదారులకు రూ.31.80 కోట్లు అందజేత
- కూటమి సర్కార్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు
- నాడు కేసులంటే తెలియని ఫైనం.. నేడు రోడ్డెక్కాలంటేనే భయం
- ఇన్స్యూరెన్స్, ఫిట్‌నెస్ చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు

చదువు లేని వారు...చదుకున్నా ఉద్యోగం రాని అనేక మంది ఆటోలనే నమ్ముకుని జీవితాలను గడుపుతున్నారు. పెరిగిన డీజిల్ ధరలు, నిత్యావసరాల ధరలు..పోలీసుల వేధింపుల కారణంగా రోజంతా కష్టపడినా వచ్చే కొద్ది సంపాదనతో కుటుంబాలు గడవక ఇబ్బందులు పడుతున్నారు. ఆటో డ్రైవర్ల కష్టాలను గుర్తించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాహన మిత్ర పేరుతో ఏడాదికి రూ.10వేలు చొప్పున ఐదేళ్లు ఒక్కొక్క డ్రైవర్‌కు రూ.50 వేలు అందించారు. ఆటో డ్రైవర్లు కొంత మేర ఊపిరి పీల్చుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక సాయాన్ని నిలిపివేసింది. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ఆటో డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ఏడాది పాలనపై ఆటో డ్రైవర్ల ఆగ్రహం

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

బాపట్లటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా అటకెక్కించింది. ఇచ్చిన హామీలను అమలుచేయకుండా సామాన్య, మధ్యతరగతి ప్రజలను ఊసూరుమనిపిస్తోంది. అదే కోవలో బతుకుబండికి భరోసా లేకుండా చేసింది. ఆటో, మ్యాక్సీ, క్యాబ్‌లు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న డ్రైవర్లకు నిరాశే మిగిలింది. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు క్రమం తప్పకుండా ప్రతి ఏడాదీ వాహనమిత్ర పథకం కింద ఏటా రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మొత్తాన్ని వాహనాల ఇన్స్యూరెన్స్, ఫిట్‌నెస్, చిన్నపాటి మరమ్మతులకు ఉపయోగపడేది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి సర్కార్ వాహనమిత్ర పథకాన్ని అమలు చేయకపోవడంతో డ్రైవర్లపైనే ఆర్థిక భారం పడుతోంది. మరోవైపు తనిఖీల పేరుతో అధిక మొత్తంలో రుసుములు విధిస్తుండటంతో రోడ్లపై వాహనాలు నడపాలంటేనే హడలిపోతున్నారు.



బాడుగలు లేక ఖాళీ ఆటోలతో కాలాన్ని వెళ్లదీస్తున్న ఆటో డ్రైవర్లు

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



గతంలో వరుసగా ఐదేళ్లపాటు వాహనమిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేల చొప్పున ఆటోలు నడిపే మాలాంటి పేదలకు ప్రతి ఒక్కరికీ రూ.50 వేలు లబ్ధి చేకూరింది. ఈ సొమ్మును ఆటో మరమ్మతులు, పిట్‌నెస్‌కు ఉపయోగించుకునేవారం. ప్రస్తుతం అధికారంలోఉన్న కూటమి సర్కార్ ఆర్థికసాయం అందించడం లేదు. మాలాంటి పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తే బాగుంటుంది.

–నూకబత్తుని రమేష్, కంకటపాలెం

ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



ఓ వైపు భగభగ మండుతున్న భానుడు...పెరిగిన నిత్యావసర వస్తువులు, డీజిల్ ధరలతో ఆటోలు నడపాలంటేనే సతమతమవుతున్నాం. కనీసం రోజంతా కష్టపడినా ఇల్లు గడవడమే కష్టంగా ఉంది. ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. గతంలో ప్రభుత్వం అందించే ఆర్థికసాయంతో వాహనాల మరమ్మతులు, ఇన్స్యూరెన్స్, ట్యాక్స్‌లు కట్టుకునేవాళ్లం. ప్రస్తుతం చాలా ఇబ్బందిగా ఉంది.

–మాదాసు సుబ్బారావు, బాపట్ల

పథకాలన్నీ అమలుచేయాలి



గతంలో మాకు ఏడాదికి వాహనమిత్ర పథకం ద్వారా రూ.10 వేల చొప్పున ఐదేళ్లపాటు రూ. 50 వేలు ఆర్థికసాయం అందజేశారు. వీటితోపాటు అమ్మఒడి, మహిళలకు డ్వాక్రా రుణాలు, రైతు భరోసా లాంటి పథకాల రూపంలో ప్రతి ఏడాదీ మా అకౌంట్‌లో నగదు జమ అయ్యేవి. ప్రస్తుతం ఏ పథకాలు అమలుకాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పథకాలన్నీ అమలుచేస్తే మాలాంటి పేదలకు మేలు జరుగుతుంది.

–గోరిపర్తి గోపి, రేపల్లె

జిల్లాలో ఐదు విడతల్లో రూ.31.80 కోట్లు అందజేత

జిల్లాలోని ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఐదు విడతల్లో 31,804 మంది లబ్ధిదారులకు రూ. 31 కోట్ల 80 లక్షల 40 వేలు అందజేశారు. ఒక్కో లబ్ధిదారుడు ఐదేళ్లలో రూ.50 వేలు లబ్ధి పొందారు.

సంవత్సరం	లబ్ధిదారులు	జమచేసిననగదు (లక్షల్లో)
2019-20	5818	రూ. 581.80
2020-21	6556	రూ. 655.60
2021-22	6187	రూ. 618.70
2022-23	6471	రూ. 647.10
2023-24	6772	రూ. 677.20
మొత్తం	31,804	రూ. 31,80,40,000

చివరిసారిగా 6772 మందికి రూ. 6.77 కోట్లు అందజేత

జిల్లాలోని వాహనచోదకులకు ప్రభుత్వం వాహన మిత్ర పథకం ద్వారా చివరిసారిగా 2023 సెప్టెంబర్ 28న జిల్లాలోని 6772 మంది లబ్ధిదారులకు వరుసగా ఐదో సారి రూ. 6,77,20,000 నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి.

నియోజకవర్గం	లబ్ధిదారులు	నగదు (లక్షల్లో)
అద్దంకి	1159	రూ. 115.90
చీరాల	1271	రూ. 127.10
పర్చూరు	916	రూ. 91.60
బాపట్ల	1168	రూ. 116.80
వేమూరు	1182	రూ. 118.20
రేపల్లె	1076	రూ. 107.60
మొత్తం	6772	రూ. 677.20

రైతులకు సక్రమంగా విద్యుత్ అందించాలి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కె.రమణారెడ్డి

చీరాల టౌన్: నియోజకవర్గంలోని గ్రామాల్లో ఇసుక నేలల్లో పంటలు పండించే రైతులకు సకాలంలో విద్యుత్ అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని.. సకాలంలో విద్యుత్ అందక పైర్లు ఎండిపోవడంతో రైతులు నష్ట పోతున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కె.రమణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పండిస్తున్న వేరుశనగ, ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల తోటలను రైతు విభాగం అధ్యక్షుడు ఆయా గ్రామాల రైతులతో కలిసి పరిశీలించారు. వేరుశనగ పంటలకు సకాలంలో నీరు అందక పంట ఎండిపోతోందని రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు సాధ్యం కాని



విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ఎండుముఖం పట్టిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న రమణారెడ్డి

హామీలిచ్చి గద్దెనెక్కిందని ఫలితంగా ప్రజలు, రైతులు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఉదయం 6 గంటలకల్లా విద్యుత్‌ను అందించి పంటల సాగుకు ఇబ్బందులు లేకుండా చేస్తే ప్రస్తుత ప్రభుత్వం ఉదయం 9 గంటలకు కూడా సక్రమంగా రైతులకు విద్యుత్‌ను అందించలేకపోతుందన్నారు.

చీరాల నియోజకవర్గంలోని కావూరివారిపాలెం నుంచి పందిళ్లపల్లి వరకు ఇసుక భూముల్లో రైతులు పండిస్తున్న పంటలకు సాగునీరును విద్యుత్ పైపుల ద్వారా అందిస్తూ పంటలు పండిస్తున్నారన్నారు. పంటల సాగుకు కావాల్సిన నీరు సకాలంలో అందక పంటలు తెగుళ్ల బారిన పడుతున్నాయని రైతుల దీనగాథలను అర్థం చేసుకోవాలన్నారు. రైతుల పంటలకు కావాల్సిన నీటిని నిర్ణీత వేళల్లోనే అందించి అన్నదాతలను ఆదుకోవాలన్నారు. అన్నదాతలను ఇబ్బందులు పెడితే తగు రీతిలో బుద్ధి చెబుతారని, రైతులకు పంటల సాగుకు కావాల్సిన నీటి సరఫరాకు విద్యుత్ ప్రతి రోజూ ఉదయం 6 గంటలకే అందించి అండగా నిలవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల్లోని రైతులు పాల్గొన్నారు.





ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, బక్రీద్ సందేశం ఇస్తున్న ముఫ్తీ రహంతుల్లా

త్యాగానికి ప్రతీక బక్రీద్

బక్రీద్ పర్వదినం సందర్భంగా గుంటూరు నగరంపాలెంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని మతపెద్దలు ఉద్బోధించారు. వేలాదిగా ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

ఎనిమిదేళ్ల కష్టమే కన్నప్ప

- హీరో విష్ణు పది కాలాలపాటు కన్నప్పగా నిలిచిపోతాడు
- ప్రతి ఒక్కరూ అద్భుతంగా నటించారు
- గుంటూరులో కన్నప్ప ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నటుడు మోహన్‌బాబు



వేదికపై సినీ నటులు మంచు మోహన్‌బాబు, విష్ణు, ప్రభుదేవా, బ్రహ్మానందం, బాలాజీ, రఘుబాబు, సప్తగిరి, తాడిశెట్టి బ్రదర్స్

నగరంపాలెం(గుంటూరువెస్ట్):ఎనిమిదేళ్ల కష్టమే కన్నప్ప చిత్రమని సినీనటుడు మంచు మోహన్‌బాబు అన్నారు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం సాయంత్రం కన్నప్ప చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకట్రావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తాడిశెట్టి మురళీమోహన్ సంయుక్త ఆధ్వర్యంలో జరగ్గా, ఏసీ కళాశాల నుంచి ఈవెంట్ వరకు ర్యాలీ కొనసాగింది. నటుడు మోహన్‌బాబు మాట్లాడుతూ కన్నప్పను పరమేశ్వరుడు ఆశీర్వదించారని అన్నారు. ఈ చిత్రంలో నటుడు మంచు విష్ణు రెండు పాత్రలు పోషించారని, చాలా అద్భుతంగా నటించాడని చెప్పారు. మళయాళం, తమిళం, హిందీ, తెలుగు భాషల్లోని అగ్రనటులు పలు పాత్రల్లో పోషించారని, ఆయా పాత్రలకు వారిని అడిగిన వెంటనే ఒప్పుకున్నారన్నారు. అగ్రనటుడు ప్రభాస్, నేను బావ అని అప్యాయంగా పిలుచుకుంటామని, పాత్ర గురించి చెప్పగానే అందులో నటించేందుకు అంగీకరించాడని అన్నారు. వైజాగ్, విజయవాడ, రాజమండ్రి, తిరుపతిలో ఈవెంట్ చేద్దామని భావించామని, అయితే గుంటూరులో చేయడం ఆనందంగా ఉందన్నారు. చాన్నాళ్ల తర్వాత గుంటూరు వచ్చానని పేర్కొన్నారు. 1991 నుంచి తాడిశెట్టి వెంకట్రావుతో పరిచయం ఉందన్నారు.

కన్నప్ప నాలో మార్పు తీసుకొచ్చింది: విష్ణు

నటుడు మంచు విష్ణు మాట్లాడుతూ నా దేవుడు నాన్న అని, ఆయన లేకపోతే నేను లేనన్నారు. నటుడు ప్రభాస్‌కు ఎంతగానో రుణపడి ఉంటానని పేర్కొన్నారు. కన్నప్ప చిత్ర ప్రయాణం నాలో ఎంతగానో మార్పు తీసుకువచ్చిందన్నారు. హాస్యనటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ మోహన్‌బాబు తమపై ఉన్న వాత్సల్యంతో ఈ చిత్రంలో పాత్ర ఇచ్చారన్నారు. పది కాలలపాటు కన్నప్పగా మంచు విష్ణు నిలిచిపోతాడని పేర్కొన్నారు. గుంటూరు బాగా పరిచయమైన స్థలమని, ఇక్కడ చదువుకున్నానని తెలిపారు. గతంలో ఈ ఊరు వచ్చి లారీలకు రంగులేశానని గుర్తుచేసుకున్నారు. దర్శకుడు ముకేష్ కుమార్‌సింగ్, నృత్యదర్శకుడు ప్రభుదేవా, నటులు రఘుబాబు, శివబాలాజీ, సప్తగిరి, ముకేష్‌రుషి చిత్ర బృందం పాల్గొన్నారు. అనంతరం మోహన్‌బాబును వెండి కిరీటంతో సత్కరించగా, తాడిశెట్టి సోదరులను మోహన్‌బాబు సత్కరించారు.

క్లుప్తంగా

'ప్రైమరీ' హెచ్‌ఎంలుగా 178 మందికి ఉద్యోగోన్నతి



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా 78 మంది ఎస్జీటీలు ఉద్యోగోన్నతిపై నియామకం పొందారు. శనివారం కలెక్టర్ బంగ్లారోడ్డులోని గుంటూరు ఎంఈఓ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఉద్యోగోన్నతులు కల్పించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల విద్యాశాఖాధికారులు సీవీ రేణుక, చంద్రకళ పర్యవేక్షణలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లోని హెచ్‌ఎంలను ఉద్యోగోన్నతిపై నియమించేందుకు దాదాపు 1,400 మంది ఉపాధ్యాయులను పిలిచారు. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాదిగా తరలివచ్చినప్పటికీ, ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా వెళ్లేందుకు విముఖత వ్యక్తం చేశారు. ఎట్టకేలకు 78 పోస్టులను ఉద్యోగోన్నతులతో భర్తీ చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో గుంటూరు డీవైఈఓ యేసురత్నం, ఎంఈఓలు ఎ.తిరుమలేష్, సీనియర్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ సోషలిజం

రేపల్లె: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించటంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పీడీ సోషలిజం డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం తాలూకా సెంటరులో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల సమస్యల పరిష్కారానికి ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన చర్చలలో ఎస్జీటీ టీచర్లకు మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీ విభాగంలో సెకండరీ గ్రేడ్ టీచర్ల కౌన్సెలింగ్ విధానాన్ని ఎంఆర్సీల ద్వారా స్క్రోల్ చేస్తూ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రకటించిందన్నారు. ఇది మోసపూరిత చర్య అని ఆందోళన వ్యక్తం చేశారు. వెబ్ కౌన్సెల్ విధానంలో ఉపాధ్యాయులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని, మాన్యువల్ కౌన్సెలింగ్ విధానాన్ని అమలు చేయటంతో సమస్య ఉండదని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు గలాబా శ్రీనివాసరావు, తేలప్రోలు శ్రీనివాసరావు, గద్దె రవీంద్ర, దోవా రవి, కె.వెంకటరత్నం, చెన్ను నరేంద్ర, బి.పావనకుమారి తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ బదిలీలు మాన్యువల్‌గా నిర్వహించాలి
–ఉపాధ్యాయ సంఘాల ఆందోళన

బాపట్లటౌన్: ఉపాధ్యాయ బదిలీలను మాన్యువల్ పద్ధతిలోనే నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాస్ అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఎంఈవో ఎస్.నిరంజన్‌కు వినతిపత్రం అందజేశారు. టీచర్ల బదిలీ విషయంలో ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ పెడతామని హామీ ఇచ్చినటువంటి ప్రభుత్వం ది.07.06.25 నుంచి 10.06.25 వరకు మ్యానువల్ కౌన్సెలింగ్ జరుగుతుందని హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకోలేక ద్వంద వైఖరిని అవలంభిస్తుందన్నారు. సెకండరి గ్రేడ్ ఉపాధ్యాయులు మాన్యువల్ కౌన్సెలింగ్ కోసం ఎదురుచూస్తున్న తరుణంలో మ్యాన్యువల్ కౌన్సెలింగ్ జరపలేం, వెబ్ కౌన్సెలింగ్ జరుపుతామని ప్రకటించడం శోచనీయమన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మండల విద్యాశాఖ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. సోమవారం అన్ని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ప్రకటన విడుదల చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బి సుభాని, ఉపాధ్యాయవాణి కన్వీనర్ పి.వి. నాగరాజు, ఎ.వి.నారాయణ, పి.శివాంజనేయులు, జి.ఉదయ్ శంకర్, సీహెచ్. శ్రీనివాస్, యూటీఎఫ్ నాయకులు ఎం.సురేష్, డి.నన్నూరయ్య, ఏపీటీఎఫ్ నాయకులు రమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భావన్నారాయణ బహుముఖ ప్రజ్ఞాశాలి

సంస్మరణ సభలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్

బాపట్ల:బీఎంఎస్ ఆలిండియా వ్యవస్థాపక అధ్యక్షులు, స్వయం సేవకులు స్థానం భావనారాయణ వివిధ క్షేత్రాలలో విశేష సేవలు అందించి బహుముఖ ప్రజ్ఞాశాలిగా నిలిచారని మాజీ ఎమ్మెల్సీ మాధవ్ పేర్కొన్నారు. బాపట్ల రోటరీ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం స్థానం భావనారాయణ సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత స్థానం భావనారాయణ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభకు ప్రముఖ స్వయంసేవక్ నేత శ్యాం ప్రసాద్ అధ్యక్షత వహించి స్థానం భావనారాయణతో నాలుగు దశాబ్దాలపాటు కలిసి పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. బీజేపీ నాయకుడు ఆర్ లక్ష్మీపతి మాట్లాడుతూ బాపట్ల పట్టణంలో పుట్టి భావనారాయణ స్వామి దేవాలయ చైర్మన్‌గా, వంశపారంపర్య ధర్మకర్తగా, స్వయంసేవకుగా, శిశుమందిర్ నిర్వాహకులుగా వివిధ క్షేత్రాలను పనిచేసే లక్షలాదిమందికి మార్గదర్శకులుగా నిలిచారని కొనియాడారు. బావన్నారాయణ సోదరుడు ఎస్‌బీఎస్ తిలక్ మాట్లాడుతూ బావన్నారాయణ బాల్యం నుండి అంతర్జాతీయ వేదికలలో చేసిన ప్రసంగాల వరకు ఆయన జీవిత ప్రస్థానాన్ని వివరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి బంగారు బాబు మాట్లాడుతూ స్వయంసేవకునిగా జీవితాన్ని ప్రారంభించి జెనీవాలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సదస్సులో భారతదేశ గళాన్ని అద్భుతంగా వినిపించిన కార్యసాధకుడు భావన్నారాయణ అని కొనియాడారు. సీబీఐ న్యాయవాది మన్నవ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ బాపట్ల ఖ్యాతిని దేశ వేదికలపైనే కాకుండా అంతర్జాతీయ వేదికలపై కూడా వినిపించి ఎందరికో ప్రేరణగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో వల్లూరి భావనారాయణ, పార్థసారథి, బొమ్మిశెట్టి బాలాజీ, బూరెల రత్తయ్య, మన్నవ బాలాజీ, జగన్నాధశాస్త్రి, డాక్టర్ శ్రీనివాస్, లేల సుధాకర్, లేళ్ల వెంకటప్పయ్య, మెండు రజిని, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మాధవ్

అంబేడ్కర్ స్ఫూర్తితో దళితుల అభ్యున్నతి

విగ్రహావిష్కరణ సభలో వివిధ రంగాల ప్రముఖులు

తెనాలి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ స్ఫూర్తిగా దళితులు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాల్సిన ఆవశ్యకత ఉందని కొల్లిపర మండల గ్రామం తూములూరు శివారు క్రిస్టియన్‌పాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభలో వక్తలు అభిప్రాయపడ్డారు. గ్రామంలో ఏర్పాటుచేసిన నిలువెత్తు విగ్రహాన్ని శనివారం రాత్రి సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ ఆవిష్కరించారు. సభకు విగ్రహ కమిటీ అధ్యక్షుడు కనపర్తి మోహనరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్ మాట్లాడుతూ, విద్యకు ప్రాముఖ్యత నివ్వాలని సూచించారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యపడుతుందనీ, ప్రతిఒక్కరు చదువుకోగలిగినప్పుడు సమాజంలో మార్పు వస్తుందని చెప్పారు. వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌జే విద్యాసాగర్ తన ప్రసంగంలో దళితులు కుర్చీల్లో కూర్చోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో రాజ్యాధికారం సాధించుకోవాల్సి ఉందన్నారు. అందుకు అంబేడ్కర్ విగ్రహం స్ఫూర్తి కావాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు.

విశ్రాంత వాణిజ్య పన్నుల అధికారి బొనిగల రామారావు మాట్లాడుతూ దళితులు, బలహీనవర్గాల ప్రజలే చరిత్రను నిర్మించినవారని గుర్తుచేశారు. భాషను కనుగొన్నది కూడా వాళ్లేనని చెప్పారు. దళితవాడల నుంచి ఎందరో మేధావులు, విద్యావంతులు వెలుగులోకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కులవివక్ష పోరాట కమిటీ నాయకుడు ఉన్నవ వినయ్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో రుగ్మతలను సోదాహరణంగా వివరించారు. వివక్షత నుంచి విముక్తులు కావాల్సి ఉందన్నారు. కనపర్తి బెనహర్ తన ప్రసంగంలో, కొల్లిపర ప్రాంతానికి చెందిన దళిత ఉద్యమనేత కనపర్తి ఏసురత్నం బాటలో దళితుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. విగ్రహ కమిటీ కన్వీనర్ తెనాలి మోహనరావు, కనపర్తి అబ్రహాం లింకన్, మన్నవ ప్రభాకర్, అక్కిదాసు కిరణ్, బేతాళ భూషణం, యంద్రపాటి సాంబయ్య, సిద్దెల అబ్రహం, యంద్రపాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన పీవీ సునీల్‌కుమార్

రేపల్లె ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌కు అవార్డు

రేపల్లె: దాతల నుంచి రక్త సేకరణలో రాష్ట్రస్థాయిలో రేపల్లె ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ అవార్డుకు ఎంపికైనట్లు బ్లడ్ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య తెలిపారు. స్థానిక బ్లడ్ బ్యాంక్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో 17 సంవత్సరాల కిందట రేపల్లె ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో నెలకొల్పిన బ్లడ్ బ్యాంక్ సెంటర్ బాపట్ల జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ నారాయణ భట్టు సహకారంతో రేపల్లె, బాపట్ల పట్టణ పరిసర ప్రాంతాలలో అనేక రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తసేకరణలో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. దాతల సహకారంతో బ్లడ్ బ్యాంక్‌కు అవసరమైన యంత్ర సామాగ్రిని, అంబులెన్స్‌ను సమకూర్చటం జరిగిందన్నారు. రేపల్లె రెడ్‌క్రాస్ సేవలను గుర్తించిన ప్రభుత్వం ప్రపంచ రక్తదాతల దినోత్సవం జూన్ 14న గుంటూరులో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదగా అవార్డు అందుకోనున్నట్లు పేర్కొన్నారు.

రైళ్లలో గంజాయి, మద్యం తరలిస్తే కఠిన చర్యలు

చీరాల రూరల్: రైళ్లలో మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలు, ప్రయాణికుల వెయిటింగ్ హాల్స్, పార్శిల్ బుకింగ్ కార్యాలయంతో పాటు ప్రయాణికులను, రైలుబండ్లను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య మాట్లాడారు. రైల్వే డీఐజీ, గుంతకల్లు రైల్వే ఎస్పీ, నెల్లూరు డీఎస్పీల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. రైల్వే అధికారులు, పోలీసుల ఆజ్ఞలను ధిక్కరిస్తే చట్ట పరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఫ్లాట్‌ఫాంలపై అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులను వారి లగేజీలను నిత్యం తనిఖీ చేస్తామని చెప్పారు. రైలు బండ్లలో కానీ ప్లాట్‌ఫాంలపై కానీ అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ప్రయాణికులకు, పార్శిల్ కార్యాలయ సిబ్బందికి సూచించారు.

ధర్మోరక్షతి రక్షితః ట్రస్ట్ భవనం ప్రారంభం



తాడికొండ: హైందవ ధర్మ విశిష్టత ప్రపంచానికి చాటి చెప్పడంలో శివస్వామి కృషి ఎనలేనిదని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శనివారం తుళ్లూరు మండలం తాళ్లాయపాలెంలోని శైవ క్షేత్రంలో ధర్మో రక్షతి రక్షితః ట్రస్ట్ నూతన భవనం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రస్ట్ నూతన భవనం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. నిర్మాణ దాతలు సతీష్ ఉమరాణి దంపతులకు ధన్యవాదాలు తెలియజేశారు. శివస్వామి ఈ ట్రస్ట్‌లో 64 సేవా విభాగాలు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. గో సంరక్షణ ద్వారా ఆరు వేల గోవులను రక్షించి వాటి పోషణ చూసుకోవడం అభినందనీయమన్నారు. మానసారా-మన సారె అనే కార్యక్రమం ద్వారా అనేక రాష్ట్రాల్లో అమ్మవారికి కార్యక్రమాలు నిర్వహిస్తూ సంస్కృతి పట్ల యువతకు అనేక ప్రయోజకర కార్యక్రమాలు అందిస్తున్నారన్నారు. భక్తునిగా శివస్వామికి తాను శిరస్సు వచ్చి పాదాభివందనలు చేస్తున్నారన్నారు. శివస్వామి మాట్లాడుతూ ధర్మోరక్షతి రక్షితహ భవనాన్ని ధార్మిక సేవా భావాలతో 2009 నుంచి నిర్వహిస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో ఎనిమిది వేల మంది ఈ ట్రస్ట్ కేంద్రంగా పనిచేస్తున్నారన్నారు. పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రమాణ స్వీకారం



వేమూరు: మార్కెట్ యార్డు చైర్మన్‌గా గొట్టిపాటి పూర్ణకుమారి ప్రమాణ స్వీకారం చేస్తారని యార్డు సెక్రటరీ అంజిబాబు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు జరిగే ప్రమాణ స్వీకార మహోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థ సారధి, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొంటారని తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నరసరావుపేటటౌన్: ప్రమాదవశాత్తూ రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాష్‌నగర్‌కు చెందిన ఇల్లూరి వీరాంజనేయరెడ్డి(38) మొదటి రైల్వే గేటు వద్ద రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొంది. సంఘటనలో తీవ్రగాయాలైన వీరాంజనేయరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఇన్‌చార్జి ఎస్‌ఐ దీపిక సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధుడు మృతి



చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్త రెడ్డిపాలెం, చెన్నారెడ్డి కాలనీ ఎస్సీ కాలనీకి చెందిన వృద్ధుడు శనివారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. కొత్త రెడ్డిపాలెంకు చెందిన కారుమూరి ధనంబాబు (60) ఇంట్లోని విద్యుత్ మోటారుకు సంబంధించిన వైర్లు ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పెద్దదిక్కు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మరణించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మృతుని కుమారుడు అనారోగ్యానికి గురవడంతో వారి కుటుంబ పోషణ, ఆలనా పాలన కూడా ధనంబాబే చూడాల్సిన పరిస్థితి ఉంది. నిరుపేద కుటుంబానికి చెందిన ధనం బాబు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారి కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. జరిగిన సంఘటనపై స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారులు పరిశీలించి నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తెలిపారు.

అపార్టుమెంట్ పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య


చనిపోయేటట్లు ప్రేరేపించారని ఆరోపిస్తున్న బంధువులు

తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలో జాతీయ రహదారి వెంబడి సర్వీసు రోడ్డులో నిర్మాణంలో వున్న ఒక అపార్టుమెంట్ పై నుంచి శనివారం సాయంత్రం ఓ వ్యక్తి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తాడేపల్లి పట్టణ సీఐ కల్యాణ్‌రాజు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతి చెందిన వ్యక్తి గుంటూరు సప్తపదిలోని విద్యానగర్‌కు చెందిన గండు జగదీష్ (35) గుర్తించారు. ఇతను తన ద్విచక్రవాహనంపై గుంటూరు నుంచి వచ్చి ఐదు అంతస్తుల భవనం పైకి ఎక్కి కిందకు దూకాడని, తలకు తీవ్రమైన గాయం ఏర్పడిందని, కొన ఊపిరితో ఉండడంతో భవనంలో పనిచేస్తున్న పనివారు ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా జగదీష్ మృతి చెందినట్లు సీఐ కల్యాణ్‌రాజు తెలిపారు. జగదీష్ మృతికి కారణాలు తెలియాల్సి ఉందని అన్నారు. ఇదిలా ఉండగా జగదీష్ బంధువులు మాత్రం గత ఐదు సంవత్సరాల నుంచి జగదీష్‌తో సన్నిహితంగా ఉండే బంధువులు హత్య చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఆ కారణం చేతే ఆత్మహత్య చేసుకున్నాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా వారే హత్య చేసిఉంటారేమోననే దిశలో దర్యాప్తు చేయాలని పోలీసులను కోరారు. ప్రత్యక్ష సాక్షులు మాత్రం బిల్డింగ్‌పై నుంచి దూకినట్లు తెలిపారు. జగదీష్ తమ్ముడిని వివరాలు అడిగేందుకు ప్రయత్నించగా ఇప్పుడు ఏమీ చెప్పలేనని, మా అన్నయ్యది ముమ్మాటికీ హత్యేనని, పోలీస్‌స్టేషన్‌లో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు.



జగదీష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ కల్యాణ్‌రాజు

పుష్కర ఘాట్ వద్ద వ్యక్తి అనుమానాస్పద మృతి



వేలాడుతున్న గుర్తుతెలియని వ్యక్తి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణానది దిగువ ప్రాంతంలోని సీతానగరం పుష్కర ఘాట్‌లో గుర్తు తెలియని మృతదేహం చెట్టుకు వేలాడుతూ మెట్లపై పడిపోయి వున్న స్థితిలో స్థానికులు గుర్తించి తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి మెడకు ఉరి వేసుకుని వున్న లుంగీ, కండువాను తొలగించి మృతదేహాన్ని పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభించలేదు. లుంగీ, కండువా కలిపి కట్టుకుని ఉరి వేసుకుని ఉంటాడని ఎస్‌ఐ శ్రీనివాసరావు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు మాత్రం కృష్ణానది తీరంలోని పుష్కర ఘాట్‌లలో, ఇసుక తిన్నెల్లో అనేక అవాంఛనీయ సంఘటనలు జరుగుతున్నాయని, చాలా మందిని కొట్టి డబ్బులు, వస్తువులు లాక్కుని పారిపోయిన సంఘటనలు ఉన్నాయని, ఇక్కడ నిద్ర చేయడానికి వచ్చిన వ్యక్తిని ఎవరో కొట్టి చంపి చెట్టుకు వేలాడి తీసి ఉంటారని అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

స్నేహమేరా జీవితం.. శాశ్వతం!



ఆత్మీయ సమ్మేళనలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

శావల్యాపురం జడ్పీ హైస్కూల్ 2003–2004 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004–2005 పదో తరగతి పూర్వ విద్యార్థులు బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత తమ గురువులను పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికిన అనంతరం తాము చదువుకున్న స్కూల్లో 20 సంవత్సరాల తర్వాత అందరిని కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని ఆనాటి మధుర జ్ఞాపకాలను తరగతి గదుల్లో తీపి గుర్తులు మాట్లాడుకున్నారు. తమ గురువులు నేర్పిన విద్య ద్వారా ఈస్థాయిలో ఉన్నట్లు వెల్లడించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు యర్రం హనుమంతరావు మాట్లాడుతూ తమ దగ్గర చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఎదిగి ఐక్యంగా గురువులను గౌరవించుకోవటం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు యర్రం హనుమంతరావు, సి.హెచ్. చంద్రశేఖర్, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, కె.జె.రమేష్, ఆర్‌కె.రమేష్ తదితరులను ఘనంగా పూలమాలలు దుశ్శాలువాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుత్తా వెంకటరావు, పాలడుగు శ్రీను, తులబందుల రమ్య, చిలంకూరి నాగలక్ష్మి, జవంగుల నాగరాజు, పరమేశ్వరరావు, యలవర్తి శిరీషా, పాలడుగు సాయి. 45 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.